www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 30 జనవరి 2024

5

ఏలూరు



అవాస్తవాలు ప్రచారం చేస్తే చర్యలు : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్: అసత్య వార్తలను ఎవరైనా ప్రచారం చేసినా, లేనిపోని అవాస్తవాలను సోషల్ మీడియాలో ప్రచురించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఫిర్యాదుదారుల నుంచి నేరుగా ఎస్‌పి వినతులు స్వీకరించారు. వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోనులో ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి మాట్లాడుతూ అనవసరమైన పుకార్లను తెలిసీ తెలియక కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని, తద్వారా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. అసత్య వార్తలు ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్నారని, వారి వలలో పడొద్దని సూచించారు. సత్యసాయి సేవా స్వచ్ఛంద సంస్థ ద్వారా స్పందన ఫిర్యాదుదారులకు ఉచిత భోజన వసతి కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దలకు అండ.. పేదలపై నిర్బంధకాండ..!

'దోసపాడులోని దళితుల భూసమస్యపై అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారా.. ఏళ్ల తరబడి సమస్యను తేల్చకుండా పేదలకు అన్యాయం చేస్తున్నారా.. పేదలకు చెందాల్సిన భూములను బడాబాబులు అక్రమంగా అనుభవిస్తున్నా అధికారులకు పట్టడం లేదా' అంటే అవుననే సమాధానం వస్తోంది. పేద భూసమస్యను ఏళ్ల తరబడి పరిష్కరించకుండా పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై బాధితుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. వెంటనే సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని బాధిత పేదలు కోరుతున్నారు.



దోసపాడులో దళితుల భూసమస్యపై అధికారుల నిర్లక్ష్యం

జెసి కోర్టులో దీర్ఘకాలంగా

అసైన్డ్ భూముల సమస్య పెండింగ్

210 ఎకరాల సీలింగ్ భూముల

స్వాధీనంలోనూ అదే నిర్లక్ష్యం

బడాబాబులకు కొమ్ముకాస్తున్నారంటూ విమర్శలు

పోలీసుల ద్వారా బాధితులను అణగదొక్కే యత్నం

సమస్యను వెంటనే తేల్చాలంటున్న బాధిత దళితులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దెందులూరు మండలం దోసపాడులో దళితుల భూసమస్యను అధికారులు ఎప్పటికి తేలుస్తారో అర్థం కాకుండాపోయింది. 2006 నుంచి దోసపాడు భూములపై బాధిత దళితులు పోరాడుతున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దశాబ్దాల కిందట ప్రభుత్వం పేదలకిచ్చిన అసైన్డ్, సీలింగ్ భూములను కొంతమంది బడాబాబులు అక్రమంగా సొంతం చేసుకుని అనుభవిస్తున్నారు. ఇప్పటికీ ఆ భూములు ప్రభుత్వం పంపిణీ చేసిన పేదల పేరుపైనే రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. మొత్తం 106 ఎకరాల అసైన్డ్ భూముల వ్యవహారంలో 48 బాధిత కుటుంబాలకు సంబంధించిన 72 ఎకరాల సమస్య జాయింట్ కలెక్టర్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఏళ్లు గడుస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇక 210 ఎకరాల సీలింగ్ భూములకు సంబంధించిన సమస్యను రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని పంపిణీ చేయాల్సి ఉన్నా ఉలుకుపలుకు లేకుండాపోయింది. తమ భూములు తమకే ఇప్పించాలంటూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయడంతోపాటు పాదయాత్రలు, భూముల్లోకి వెళ్లడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. పోలీసులను రంగంలోకి దింపి బాధితులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారే తప్ప భూసమస్యను మాత్రం పరిష్కరించడం లేదు. భూములు పేదల పేరిట ఉన్నట్లు రికార్డులు స్పష్టంగా చూపిస్తున్నా నాన్చుడి ధోరణి ఎందుకు అవలంభిస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. దోసపాడు భూసమస్యకు సంబంధించి దాదాపు 125 బాధిత కుటుంబాలు ఉన్నాయి. వీరంతా తమకు న్యాయం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. భూములకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ అధికారులు బాధితులతో మాట్లాడి పరిష్కరించాలి. అయితే దెందులూరు మండలంలోని రెవెన్యూ అధికారులు మాత్రం భూముల వద్దకు వెళ్లకుండా పోలీసులను పంపుతున్న పరిస్థితి ఉంది. దెందులూరు మండల రెవెన్యూ అధికారులే సమస్యను పరిష్కరించకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూములను సొంతం చేసుకున్న విజయవాడకు చెందిన దేవినేని బాజీప్రసాద్‌కు స్థానిక రెవెన్యూ అధికారులు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకునే అధికారులు, ఆ ప్రజలకు అండగా ఉండకుండా బడాబాబులకు అండగా ఉండటంపై సర్వత్రా చర్చ సాగుతోంది. దోసపాడు భూసమస్య పరిష్కారంలో అధికారులు కావాలనే నాన్చుడి ధోరణి ప్రదర్శిస్తున్నారనే అభిప్రా యం బాధితుల్లో వ్యక్తమవుతోంది. చట్టప్రకారం వ్యవహరించాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లా ఉన్నతాధికారులను సైతం మండలంలోని రెవెన్యూ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారనే అభిప్రాయం బాధితుల్లో నెలకొంది. అధికారులు వెంటనే దోసపాడు దళితుల భూసమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

'స్పందన'లో 221 అర్జీలు స్వీకరణ

డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు



వినతులు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ

ప్రజాశక్తి - ఏలూరు

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో 221 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, హౌసింగ్ పీడీ కె.రవికుమార్, డ్వామా పీడీ రాము, డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణమూర్తితో కలిసి డిఆర్‌ఒ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షుణంగా పరిశీలించి సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. ద్వారకాతిరుమలకు చెందిన హేమా పవన్‌కుమార్ తమకు పంచాయతీ వారు లేఅవుట్ వేసి ఇంటిస్థలం ఇచ్చారని, సదరు లేఅవుట్‌లో ఉన్న దారిని ఆక్రమించుకుని దారిలేకుండా కొంతమంది దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆక్రమణను తొలగించి దారి చూపాలని కోరారు. కాట్లంపూడికి చెందిన మరియమ్మ డ్రెయినేజీ తవ్వకం సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నడిపల్లికి చెందిన తిరుపతిరావు తమ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్థంగా ఉందని, సీసీ డ్రెయిన్ల నిర్మాణం సరిగా లేక మురుగునీరు నిల్వ ఉండి దోమలవల్ల గ్రామ ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. పారిశుధ్యం మెరుగుపర్చాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.




లైబ్రరీ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

లైబ్రరీ అంటే జ్ఞాన స్థలం

ప్రతి పుస్తకం జీవితంలో విజయానికి కొత్త మార్గం

పలు పాఠశాలల్లో లైబ్రరీ గదులను ప్రారంభించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



విద్యార్థులతో కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

మనం చదివే ప్రతి పుస్తకం జీవితంలో విజయానికి ఒక కొత్త మార్గాన్ని చూపుతుందని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) నిధులు రూ.10 లక్షలతో కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో, రూ.24 లక్షలతో ఆదివారపుపేటలోని ఎఆర్‌డిజికె నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్మించిన లైబ్రరీ గదులను సోమవారం ఆయన ప్రారంభించారు. లైబ్రరీకి సంబంధించిన పలు పుస్తకాలను ఈ సందర్భంగా కలెక్టర్ ఆవిష్కరించారు. లైబ్రరీ నిర్వహణకు సంబంధించి సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా జ్ఞానానిచ్చే అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులను జ్ఞానవంతులుగా చేసి సమాజానికి తోడ్పడే నైతిక బాధ్యతలు కలిగిన వ్యక్తులుగా చేయడంలో లైబ్రరీలు దోహద పడతాయన్నారు. సమాచార జ్ఞానం కలిగిన విద్యార్థులు తమ సొంతంగా చదువుకునే శక్తి కలిగి వారికి కావాల్సిన సమాచార అవసరాలను గుర్తించి సరైన ఆలోచన విధానంతో నడుచుకుంటారన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదివి తిరిగి వాటిని పాఠశాలలోని గ్రంథాలయంలో భద్రపర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయ నిర్వహణ కోసం ఒక ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకోవాలని సూచించారు. సిఎస్‌ఆర్ నిధులు రూ.10 లక్షలు చొప్పున కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల, కొవ్వలి జెడ్‌పి పాఠశాలలో లైబ్రరీ గదులను ఏర్పాటు చేయగా ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.24 లక్షలతో ఆదివారపుపేటలోని ఎఆర్‌డిజికె నగరపాలక ఉన్నతపాఠశాలలో లైబ్రరీ గదులను ఏర్పాటు చేశారన్నారు. లైబ్రరీలో మరిన్ని విజ్ఞానాన్ని కలిగించే పుస్తకాలను ఇతరుల నుంచి కూడా సేకరించాలని, తాము కూడా దీనికి సహకరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన లైబ్రరీలపై విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. తమ పాఠశాలల్లో లైబ్రరీ గదిని ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ లైబ్రరీలో ఉన్న దినపత్రికలు, ఇతర విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలను చదివి మరింత విజ్ఞానవంతులు కావాలని కలెక్టర్ సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు బెస్టాఫ్ లక్ చెప్పిన కలెక్టర్


ఆయా పాఠశాలల్లో లైబ్రరీ గదులను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అక్కడున్న పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ రానున్న పరీక్షల్లో విజయవంతులు కావాలని బెస్టాఫ్ లక్ చెప్పారు. పరీక్షలకు ఉన్న సమయాన్ని వృథా చేయకుండా విద్యపైనే దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ శ్యామ్‌సుందర్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ బాపిరాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉజ్వల, జి.సునీత, పలువురు నగరపాలక సంస్థ ఇంజినీర్లు, టీచర్లు పాల్గొన్నారు.

ధన్యజీవి సూర్యప్రకాశరావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రతి మనిషికీ జననం, మరణం సహజమని, అయితే మనిషి బతికున్నంత కాలం ఈ సమాజం కోసం ఏం చేశారనే దానిబట్టి ఆ మనిషి గొప్పతనం తెలుస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. సోమవారం స్థానిక పడమర వీధిలోని సిపిఎం పూర్వపు పట్టణ కార్యదర్శి పల్నాటి సూర్యప్రకాశరావు సంస్మరణ సభ పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. సభలో ముఖ్యవక్త సీతారాం మాట్లాడుతూ సమాజంలో మనిషి పుట్టుక, చావు సహజమేనని, పుట్టిన ప్రతి మనిషీ గొప్పవాడు కాలేడని అన్నారు. ఈ సమాజంలో మనుషుల మధ్య కుల, మత, ఆర్థిక, లింగ బేధ అంతరాలు పోగొట్టి సమ సమాజ స్థాపనే ధ్యేయంగా సిపిఎం పని చేస్తోందన్నారు. అటువంటి సిపిఎం జెండాను చేతబట్టి, తుది శ్వాస విడిచే వరకూ పని చేసిన సూర్యప్రకాశరావు ధన్యజీవి అని కొనియాడారు. సూర్యప్రకాశరావు సాధారణ రైస్ మిల్లు కార్మికునిగా జీవితం ప్రారంభించారని, తాను పని చేస్తున్న కార్మికుల హక్కులు కాపాడటం కోసం సిఐటియు తరపున రైస్‌మిల్లు కార్మికుల సంఘాన్ని ఏలూరు తాలూకాలో స్థాపించారని గుర్తు చేశారు. కార్మికుల హక్కుల కోసం యజమానులతో వేతన ఒప్పందాలు చేసే సమయంలో ఒక్క పైసా దగ్గర కూడా రాజీ పడేవారు కాదని తెలిపారు. నిరాడంబర జీవితం, నిజాయతీలను ప్రకాశరావు నుండి నేటి యువతరం నేర్చుకోవాలన్నారు. పార్టీ కార్యకర్తల పట్ల ఆయన చూపించే గౌరవం నేటి నాయకత్వం నేర్చుకోవాలని సూచించారు. సీనియర్ నాయకులు బి.సోమయ్య మాట్లాడుతూ రైస్‌మిల్ కార్మికుల హక్కుల కోసం ఏలూరులో ఉద్యమం జరుగుతున్నప్పుడు యజమానులు కొందరు కిరాయి గుండాలను పెట్టి ప్రకాశరావుపై హత్యాయత్నానికి పాల్పడితే ఆయన ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డారని గుర్తు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సూర్యప్రకాశరావు ఏలూరు పట్టణంలో కార్మిక ఉద్యమ నేతగా, హమాలీ కార్మికుల హక్కుల కోసం పని చేశారన్నారు. ఆయన అటు కుటుంబాన్ని, పిల్లలను తీర్చిదిద్దుకోవడం తోపాటు పట్టణంలో కార్మికోద్యమాన్ని నిర్మించారని కొనియాడారు. పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సీనియర్ నాయకుల్లో ప్రకాశరావు ఒకరన్నారు. ప్రతి సమావేశంలో ముక్కుసూటితత్వంతో మాట్లాడే వారని తెలిపారు. తన తదిశ్వాస వరకు ఎవరిపైనా ఆధారపడకుండా తన పనులు తానే చేసుకునే వారని గుర్తు చేశారు. సిపిఎం సీనియర్ నేత చింతకాయల బాబూరావు మాట్లాడుతూ సూర్యప్రకాశరావు హమాలీలు, రైస్‌మిల్లు కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం తన యావత్ జీవితాన్ని ధారబోశారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ తమ తరానికి సూర్యప్రకాశరావు లాంటి నేతలు ఆదర్శమని కొనియాడారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ మనిషి చనిపోతే ఆ కుటుంబాల్లో ఒకటి, రెండు సంవత్సరాలు మాత్రమే గుర్తుపెట్టుకుంటారని, కమ్యూనిస్టు పార్టీల్లో జీవితాంతం ఆ కార్యకర్త చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూనే ఉంటారని అన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పల్నాటి సూర్యప్రకాశరావు సిపిఎం నేత అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీల నాయకులందరికీ ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. ఈ సభలో సిపిఎం సీనియర్ నాయకులు కంది విశ్వనాథం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు, సిపిఎం పడమర వీధి శాఖ కార్యదర్శి వైఎస్.కనకారావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, ఆర్.లింగరాజు, జి.రాజు, నాయకులు కె.శ్రీనివాస్, పివి.రామకష్ణ, తెల్లం దుర్గారావు, ఎ.ఫ్రాన్సిస్, జి. వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం



నివాళులర్పిస్తున్న నేతలు



పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

చల్లచింతలపూడిలో పులి పాదముద్రలు

తిరుగు ప్రయాణంలో ఉన్నట్లు గుర్తించాం - డిఎఫ్‌ఒ రవీంద్రధామ

ప్రజాశక్తి - ఏలూరు

చల్ల చింతలపూడి పరిసరాల్లో పులి పాద ముద్రలు గుర్తించామని డిఎఫ్‌ఒ రవీంద్రధామ తెలిపారు. నల్లజర్ల మండలము పుల్లలపాడు గ్రామ సమీపములో నల్లజర్ల రిజర్వు ఫారెస్టులో పులి సంచరిస్తున్నట్లు పాదముద్రల ద్వారా సమాచారం ఉందన్నారు. ఆ పులి తిరుగు ప్రయాణంలోఉన్నట్లుగా పాదముద్రల ద్వారా గుర్తించామన్నారు. పులి సంచరించే ప్రాంతాల్లో అటవీశాఖ న్యూఢిల్లీ ఎన్‌టిసిఎ వారి సూచనల మేరకు కెమెరాలు, నిరంతరం పులి కదలికలను తెలుసుకోవడానికి బృందాల ద్వారా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

నేడు, రేపు కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ



మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన తాటిచెట్టు, ఫ్లెక్సీ

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల 30, 31 తేదీల్లో తణుకులో గీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆహ్వాన కమిటీ అధ్యక్షులు కామన మునిస్వామి తెలిపారు. 30వ తేదీన రాష్ట్ర మహాసభలకు 20 జిల్లాల నుంచి సుమారు 400 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. అదే రోజు గీత కార్మికులు మోకులు కట్టుకొని మున్సిపల్ కార్యాలయం నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా సమావేశం జరగనున్న లయన్స్ క్లబ్ ఆడిటోరియం వరకూ ప్రదర్శన నిర్వహిస్తారని తెలిపారు. ప్రదర్శన అనంతరం 80 వసంతాల సభ జరుగుతుందని తెలిపారు. 31వ తేదీ రెండో రోజు వివిధ 20 జిల్లాల నుంచి వచ్చిన సొసైటీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో మహాసభ నిర్వహిస్తామని, ఈ సభకు ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని గీత కార్మికులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో నరేంద్ర సెంటర్ వద్ద తాటిచెట్టు ఏర్పాటు చేశారు.



నినదిస్తున్న సెర్ఫ్ ఉద్యోగులు

ఆరో రోజు కొనసాగిన సెర్ఫ్ ఉద్యోగుల సమ్మె


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సెర్ఫ్ ఉద్యోగుల జెఎసి చేపట్టిన నిరవధిక సమ్మె ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆరో రోజు సోమవారం కొనసాగింది. ఉద్యోగులు నల్ల దుస్తులు ధరించి నోటికి నల్ల రిబ్బన్లు కుట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా ఛైర్మన్ సిహెచ్.సుబ్బారావు మాట్లాడుతూ కేడర్లు, పే స్కేల్‌ను సక్రమంగా నిర్ణయించి ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని, ఫైనాన్స్ డిపార్టుమెంట్ ద్వారా ఉద్యోగుల సేవలు క్రమబద్ధీకరించడానికి మంజూరు చేసిన పోస్టులపై వెంటనే జిఒ ఇవ్వాలని కోరారు. ప్రస్తుత సీలింగ్ విధానానికి బదులుగా నూరుశాతం బేసిక్ పేపై ఇపిఎఫ్ కంట్రీబ్యూషన్ అమలు చేయాలని, రిజర్వేషన్ల నియమాన్ని సక్రమంగా వర్తింపజేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని, మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామక పథకం అమలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లకు సంబంధించి ఇప్పటికే రెండుసార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించామని, అయినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదని, తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడతామని తెలిపారు. జెఎసి మెంబర్ కన్వీనర్ హేమంత్ కుమార్, కన్వీనర్ బాపూజీ, గోపీ, అనిత, లత, విజయకుమారి పాల్గొన్నారు.


పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. మండలంలోని కోడూరులో రూ.31 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపి చొప్పర్ల సునీత, రాచూరి రాధ, కోమటి విష్ణు, పార్టీ మండలాధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, మాజీ ఎఎంసి ఛైర్మన్ బొర్రా శేషుబాబు, కొల్లి నాని, కన్నెపాముల భాగ్యలక్ష్మి, మర్రివాడ సుధాకర్‌రెడ్డి, సాక్షి సాయిబాబు, ఆడుసుమిల్లి వెంకటరాజు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు



మోహనరావును సన్మానిస్తున్న ఎంఎల్ఎ

ఘనంగా క్రాంతి హైస్కూల్ 36వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కలిదిండి

గ్రామీణ ప్రాంతంలో ప్రయివేటు విద్యాసంస్థ నెలకొల్పి 36 వసంతాలు పూర్తి చేసుకోవడం యాజమాన్య నిబద్ధతకు నిదర్శనమని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కోరుకొల్లు క్రాంతి హైస్కూల్ 36వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. అప్నా డెమొక్రటిక్ రాష్ట్ర నాయకులు గొల్లపూడి మోహనరావును సన్మానించారు. తొలుత క్రాంతి ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ సొసైటీ ట్రెజరర్ సిహెచ్.సుబ్బలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. క్రాంతి హైస్కూల్ కరస్పాండెంట్ చన్నం శెట్టికృష్ణ, ప్రిన్సిపల్ చన్నం శెట్టి అజేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన 36వ వార్షికోత్సవంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, అప్నా కైకలూరు డివిజన్ అధ్యక్షులు ఎవి.కోటేశ్వరరావు, క్రాంతి హైస్కూల్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

3న మెగా జాబ్‌మేళా

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గంలో 2 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మన ఊరు-మన ప్రగతిలో భాగంగా ఫిబ్రవరి 3న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్వతంత్ర అభ్యర్థి వెంప దుర్గారావు అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 30 కంపెనీలకుపైగా చింతలపూడికి తీసుకు వస్తున్నామని ఆర్అండ్‌బి బంగ్లా వద్ద మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చింతలపూడి నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రమాద బాధితులను కాపాడితే ప్రోత్సాహం

ఏలూరు : రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి బాధితులను కాపాడిన వారిని ప్రోత్సహిస్తూ రూ.5 వేల నగదు బహుమతి, ఆపద్బాంధవుడిగా గుర్తించి ప్రభుత్వం సేవాపత్రం అందిస్తుందని మోటార్ వెహికల్స్ ఇన్స్‌పెక్టర్ కెవిఎస్.ప్రసాద్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఉప రవాణా కమీషనర్ ఎస్.శాంతకుమారి ఆధ్వర్యంలో రహదారి భద్రతా నియమాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు.

సంక్రాంతి కానుక చెల్లించాలని వినతి

ఏలూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ ప్రకారం అవుట్‌సోర్సింగ్, ఉద్యోగ సిబ్బందికి రూ.వెయ్యి తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు కోరారు. ఈమేరకు సోమవారం యూనియన్ నాయకులు నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణను కలిసి వినతిని సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా పురపాలక, నగరపాలక సంస్థల్లో, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి, కార్మికులకు సంక్రాంతి సందర్భంగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి జిఒఎంఎస్ నెంబర్ 12 విడుదల చేసింది. దాని ప్రకారం రూ.వెయ్యి తక్షణమే ఇవ్వాలని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ సహాయ కార్యదర్శి ఎస్ఎంవి.సుబ్బారావు, కోశాధికారి బి.నారాయణరావు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు కిందపడి మహిళకు గాయాలు

మండవల్లి : కూలీ పనికి వెళ్లేందుకు రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు రైలు కింద పడిన సంఘటనలో ఒక మహిళకు రెండు కాళ్లకు తీవ్ర గాయాలైన సంఘటన మండవల్లి రైల్వేస్టేషన్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. మూడు తాళ్లపాడు గ్రామానికి చెందిన కమతం హేమలత(60) గుంటకోడూరులో కూలీ పనికి వెళ్లడానికి భీమవరం-మచిలీపట్నం రైలు ఎక్కే క్రమంలో అదుపుతప్పి ఆమె ప్లాట్ ఫారానికి రైలుకు మధ్యలో పడిపోయింది. ఇది గమనించిన ప్రయాణికులు పెద్దగా కేకలు వేస్తుండడంతో గార్డు అప్రమత్తమై రైలును వెంటనే నిలిపివేశారు. ఆమె రెండు కాళ్లకు తీవ్ర గాయలయ్యాయి. హుటాహుటిన ఆమెను ఆసుపత్రికి తరలించినట్లు ప్రయాణికులు తెలిపారు.

పాత కక్షలతో మహిళపై దాడి

నూజివీడు రూరల్ : పట్టణంలోని తిరువూరు బస్టాండ్ వద్ద నివాసముంటున్న షేక్ ఫాతిమా (35)పై పాత కక్షల నేపథ్యంలో పదిమంది దాడి చేసినట్లు బాధితురాలు సోమవారం తెలిపింది. తన భర్తతో మహిళలకు ఉన్న సంబంధం మేరకు ఏడుగురు మహిళలు, ముగ్గురు మగవాళ్ల దాడి చేసినట్లు తెలియజేసింది. ఈ దాడిలో తన చేయి విరగదీసి, పొట్టపై కొరికారని తెలిపింది. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం

ముదినేపల్లి : ఓ యువతి అదృశ్యమైన సంఘటన మండలంలోని పెదగొన్నూరు శివారు కర్షక మాలపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే కర్షక మాలపల్లికి చెందిన దాసరి జయ పావని (18) ఈనెల 24 అర్ధరాత్రి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిపోయింది. ఉదయం చూసేసరికి కుమార్తె కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత గాలించిన ఆచూకీ తెలియ రాలేదు. దీంతో ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి ముఠా అరెస్ట్

నూజివీడు రూరల్ : గుట్టు చప్పుడు కాకుండా ఆటోలో గంజాయిని తరలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన ముసునూరు మండలం కాట్రెను పాడులో సోమవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా నూజివీడు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నలుగురు వ్యక్తులు మూడు కిలోల గంజాయిని తరలిస్తుండగా అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. రూరల్ సిఐ బాల సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం విక్రేతపై కేసు

టి.నరసాపురం : అక్రమంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపారు. మండలంలోని బంధంచర్ల గ్రామంలో అక్రమంగా మద్యం బాటిల్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసి రూ.1,040 విలువ చేసే 8 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.



ఎత్తిపోతల పథకం కాలువ



కాలువ సమీపంలో ఏర్పాటు చేసిన వంతెన

నష్టపరిహారం అందేదెప్పుడు..?

చింతలపూడి ఎత్తిపోతల భూసేకరణలో అధికారుల తీరుపై అన్నదాతల ఆందోళన


పరిహారం కోసం పడిగాపులు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎత్తిపోతల భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులపై ప్రభుత్వం తీరు అత్యంత దారుణంగా తయారైంది. అన్నదాతలపై ఏ మాత్రం కనికరం లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. కనీసం నష్టపరిహారంపై అధికారులు ఆలోచించని పరిస్థితి. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో అంతా తీవ్ర ఆవేదనకు గురువుతున్నారు. గత ప్రభుత్వంలో పట్టిసీమ తరహాలో తమకు ప్యాకేజీ ఇచ్చి న్యాయం చేయాలని చింతలపూడిలో రైతులు పోరాటం చేస్తుండగా ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైసిపి వారికి మద్దతు ఇచ్చి, ఒక కమిటీని ఏర్పాటు చేసి రీలే దీక్షలు, రాస్తారోకోలు, వంటవార్పు కార్యక్రమలు వైసిపి నాయకులు చేశారు. అధికారంలోకి వచ్చాక కనీసం పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

మెట్ట ప్రాంతానికి వరప్రదాయనిగా చెబుతున్న చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. 2.52 లక్షల ఎకారాలకు సాగు నీరందించే లక్ష్యంతో 15 మండలాల మీదుగా చింతలపూడి కాలువ పనులకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలో రూ.4,909.68 కోట్లు సవరించి, అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగేయి. 2017 పట్టిసీమ ఎత్తిపోతల పథకం భూసేకరణలో భూములిచ్చిన రైతులకు ఎకరానికి రూ.21 లక్షల నుంచి 50 లక్షలకుపైగా ప్రభుత్వం చెల్లించింది. కాని చింతలపూడి రైతుల విషయంలో గత ప్రభుత్వం విరుద్ధంగా వ్యవరించిందని, ఎకరానికి రూ.12.50 లక్షలు మాత్రమే ప్రకటించిందన్నారు. బయట మార్కెట్‌లో ఎకరానికి రూ.30 లక్షల నుంచి 40 లక్షల వరకు ఉందని రైతులందరూ ఎత్తిపోతల రైతులను అడ్డుకున్నారు. గత ప్రభుత్వంలో అనేక రకాలుగా ఉద్యమాలు చేపట్టారు. ఎంపీ శ్రీధర్, ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా చింతలపూడి రైతులకు వైసిపి అధికారంలోకి రాగానే రైతులకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలుపైగా అవుతున్న రైతులను పట్టించుకున్న నాధులే లేరు.

ఇప్పుడు ఎన్నికల వాతావరణం నెలకొనడంతో చింతలపూడి ఎత్తిపోతల రైతులకు ఏం సమాధానం చెప్పి ఎన్నికలకు వెళ్తారనే సందిగ్ధం నెలకొంది. రైతులకు అధికారంలోకి రాగానే నష్టపరిహారం అందిస్తామని చెప్పి దీనిపై ఇప్పటికి స్పష్టత ఇవ్వలేని అధికారులు, వైసిపి ప్రభుత్వ తీరుపై రైతన్నలు మండిపడుతున్నారు. గత పది సంవత్సరాలుగా భూములిచ్చి నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం వారికి ఏం సమాధానం చెబుతుందో, ఏవిధంగా న్యాయం చేస్తుందో చూడాలి.



మాట్లాడుతున్న అంద్రాజు శ్రీనివాసరావు

మత్స్యకారుడిని పొట్టన పెట్టుకున్న వైసిపి

టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కలిదిండి

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం బంగారుపెంట తండా సమీప మత్స్యకారుడు దుర్గారావుని వైసిపి ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో ఆయన మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ వైసిపికి తొత్తుగా మారి, టిడిపి, జనసేన సానుభూతి పరులను వైసిపిలో చేర్పించే పనిలో పడి వారి ప్రాణాలను హరించేస్తున్నారన్నారు. ఎంఎల్ఎ పిన్నెల రామకృష్ణా రెడ్డి డైరెక్షన్‌లో వెల్దుర్తి పోలీసుల వేధింపుల వల్లే దుర్గారావు బలవన్మరణం చెందాడని ఆరోపించారు. ఒక్క అవకాశం ఇస్తేనే బిసి, ఎస్‌సిలపై అరాచకం సృష్టిస్తున్న వైసిపి ప్రభుత్వం, మరో అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని వల్లకాడుగా మారుస్తుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. దుర్గారావు మృతికి కారకులైన వారిని సిటింగ్ జడ్జిచే విచారణ చేసి శిక్షించాలని, లేకుంటే మత్స్యకారులు ఏకతాటిపైకి వచ్చి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మత్స్యకార నాయకులు నాగిడి వీర బ్రహ్మం, తిరుమాని పాండురంగారావు, మోకా వెంకటరమణ, తిరుమల శెట్టి ఈశ్వర పరశురాముడు, నాగిడి నారాయణ మూర్తి పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం

జీలుగుమిల్లి : అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల గుండా పన్నుల శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు రాష్ట్ర పన్నుల శాఖ ఏలూరు డివిజన్ జాయింట్ కమిషనర్ డి.శ్రీలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని తాటియాకులగూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద రాష్ట్ర పన్నుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తనిఖీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల గుండా తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. రాష్ట్ర సరిహద్దు గుండా జిఎస్‌టి కట్టకుండా సరుకుతో వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎటువంటి రశీదులు లేకుండా సరుకు తరలుతున్నట్లైతే, అట్టి వాహనలపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి.వినోద్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెదలంకలో 'భవిష్యత్తు గ్యారెంటీ'

కలిదిండి : మండలంలోని పెదలంక హరిజనవాడలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు, మహాసేన జిల్లా అధ్యక్షులు చాబత్తిన రాజు, ఎస్‌సి సెల్ మండల ఉపాధ్యక్షులు బళ్ల రాజు ప్రజలకు వివరించారు. ఉపసర్పంచి చాబత్తిన ఛాయా దేవి, నాయకులు వాతాడి రామకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

పశ్చిమగోదావరి జట్టు విజయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నారాయణపురం డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 45వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జట్టు ఛాంపియన్‌షిప్ సాధించింది. సోమవారం డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయులు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణలు పాల్గొని విజేతలకు కప్పులతో పాటు పతకాలను అందజేసి అభినందించారు. మొదటి స్థానం పశ్చిమగోదావరి జిల్లా జట్టు, రెండవ స్థానం విశాఖపట్నం జట్టు, మూడవ స్థానం నంద్యాల జిల్లా జట్లు కైవశం చేసుకున్నాయి. నారాయణపురం ప్రజా పరిధిలో దాతలు సహకరించడంతో పోటీలు విజయవంతంగా ముగిశాయని ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు రాజారావు, చంద్రశేఖర రావు, లక్ష్మణ్ పాల్గొని కృతజ్ఞతలు తెలిపారు.



గెలుపొందిన జట్టు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన

ప్రజాశక్తి - ముసునూరు

అధికారులు సమన్వయంతో పనిచేసి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనలు పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావ్ అధ్యక్షతన ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ మండలశాఖాధికారులు ఏ ఒక్కరి దగ్గర మా నాయకుల ఫోన్ నెంబర్లు లేవని, మేము ప్రజా సమస్యలపై ఫోన్ చేసినప్పుడు ఎవరు అంటూ సమాధానం ఇవ్వడం మా దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు ధాన్యం కొనుగోలు అధిక శాతంలో చేయడంతో పాటు అధిక ధర కల్పించడం, వెంటనే వారి ఖాతాలో నగదు జమచేయించడం జరిగిందన్నారు. విద్యాశాఖాధికారులతో కలిసి 8వ తరగతి చదువుతున్న 447 మంది విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశామన్నారు. జగనన్న లేఅవుట్లలో బిల్లులు త్వరగా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పాముల గంగధరరావు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావ్

రేపు కొల్లేటి పాట ఆవిష్కరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈనెల 31న ఏలూరు పట్టణంలో వైఎమ్‌హెచ్ హాలులో జరుగు కొల్లేటి సరస్సుపై అరుణోదయ విమలక్క పాడిన పాట ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రియదర్శిని కళాశాలలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ మత్స్యకారులకు, ఫ్లయింగ్ పక్షులకు ఆధారమైన కొల్లేటి మంచినీటి సరస్సును కలుషితం చేసి భూస్వాములు తమ ఆర్థిక ఎదుగుదలకు వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ ఆంధ్ర నాయకులు ఎసిఎఫ్ఎపిఆర్‌సిఎస్ జిల్లా కమిటీ నాయకులు కొండ రాము, జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి బత్తుల బాబురావు, రాంబాబు పాల్గొన్నారు.

చిరంజీవికి పద్మవిభూషణ్ పట్ల హర్షం

చింతలపూడి : ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తి మెగాస్టార్ చిరంజీవి అని మెగాస్టార్ ఫ్యాన్స్ జిల్లా అధికార ప్రతినిధి తూము విజయ్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో సోమవారం మెగాస్టార్ చిరజీవికి 'పద్మ విభూషన్' అవార్డు వచ్చిన సందర్భంగా శారదా మినీ థియేటర్ వద్ద చింతలపూడి, మెగా ఫామిలీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి సినీ ప్రయాణం గురించి వివరించారు. ఈ సందర్భంగా మెగా ఫ్యాన్ మండల గౌరవ అధ్యక్షులు కోప్పర్ల నాగరాజు, మాజీ ఎంపిటిసి రాజు మారేష్, వెంకన్న, దుక్కిపాటి మోషే, ప్రధాన కార్యదర్శి రావిపాటి సూర్య, కార్యదర్శి కుమార్, సంయుక్త కార్యదర్శి, గోపి శుభాకాంక్షలు తెలియజేశారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు: డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి(జిల్లా కో-ఆర్డినేటర్) ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ఎన్.సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఫిబ్రవరి 23 వరకు https://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 7995562116ను సంప్రదించాలని తెలియజేశారు.

రహదారి ఏర్పాటు చేయాలని వినతి

కుక్కునూరు: మండలంలోని జిన్నలగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు రహదారి ఏర్పాటు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా నివాసముంటున్న మాకు కనీసం రహదారి కూడా లేదని వాపోయారు. ఈ మధ్య కాలంలో కూరం కోసి అనే గిరిజన మహిళ ప్రసవ వేదన గురైన విషయం తెలిసిందే, దగ్గరలో వున్న పిహెచ్‌సికి వెళ్లడానికి రహదారి లేక డోలి ద్వారా అటవీ ప్రాంతం దాటే వరకు తీసుకు రావడం జరిగిందన్నారు. విద్య, వైద్యం వంటి సమస్యలకు మాకు పరిష్కారం కావాలని తహశీల్దార్ కార్యలయంలో వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ నరసింహారావు, సిపిఐ మండల కార్యదర్శి వెంకటాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: నేడు టి.నరసాపురం, బొర్రంపాలెం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలు మార్పు చేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రాధాకృష్ణ సోమవారం విలేఖరులకు తెలిపారు. మండలంలోని టి.నరసాపురం, గుర్వాయిగూడెం, బొర్రంపాలెం గ్రామాల్లో క్రాసింగ్ లైన్ పనులు జరుగుతున్న క్రమంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

రూరల్ ఎస్ఐగా మల్లికార్జున రెడ్డి

నూజివీడు రూరల్: నూజివీడు రూరల్ ఎస్ఐగా మల్లికార్జున రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు ఎస్ఐగా విధులు నిర్వర్తించిన తలారి రామకృష్ణ కైకలూరు స్టేషన్‌కు బదిలీ కాగా, జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ నుంచి మల్లికార్జున రెడ్డి నూజివీడుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రత, పరిరక్షణ తన ధ్యేయమని తెలిపారు.

పంచలోహ విగ్రహాల బహూకరణ

పోలవరం : పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామికి సోమవారం రాజమహేంద్రవరానికి చెందిన మడిచర్ల సుధాకర్ రావు, వెంకటలక్ష్మి దంపతులు పంచలోహ విగ్రహాలను, సింహాసనాన్ని బహూకరించారు. అనంతరం స్వామి వారి కళ్యాణం నిర్వహించి, భారీ అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సంగమేశ్వర శర్మ తెలిపారు.

'కొత్త పట్టిసీమ అభివృద్ధికి గర్విస్తున్నాం'

పోలవరం : కొత్త పట్టిసీమ గ్రామం తొలి పంచాయతీ సర్పంచిగా ఎన్నికై పంచాయితీ అభివృద్ధి, పారిశుధ్యంలోనూ జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు తెచ్చినందుకు గ్రామస్తుడిగా గర్విస్తున్నామని స్థానిక వైసిపి నాయకుడు మైగాపుల దుర్గాప్రసాద్ తెలిపారు. జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీ సర్పంచిగా ఎన్నికైన కొత్త పట్టిసీమ సర్పంచి మైగాపుల విజయదుర్గకి గ్రామస్తులు సోమవారం సన్మానం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, సాయిబాబా పాల్గొన్నారు.

అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగించాలని వినతి

మండవల్లి : రోడ్డు ప్రమాదాలు సంభవించే విధంగా రహదారుల వెంబడి విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన అనుమతులు లేని ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు టి.అప్పారావు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ రాజకుమార్‌కు అనధికార ఫ్లెక్సీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి 165పై ఎక్కడబడితే అక్కడ అనుమతులు లేకుండా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారన్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికుల దృష్టి మరలి ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుని, రహదారి ప్రమాదాల నుంచి వాహనదారులను, ప్రజలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.

నెహ్రూ నగర్‌లో కామన్ సైట్ కబ్జా

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు అర్బన్ : ఏలూరు నియోజకవర్గంలోని 15వ డివిజన్, నెహ్రూ నగర్ ఆముదాల అప్పలస్వామి కాలనీలో ఉన్న కామన్ సైట్‌ని కబ్జాకు గురికాకుండా కాపాడాలని జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు అధికారులను కోరారు. అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ఆ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, అక్కడి స్థానిక ప్రజలు రెడ్డి అప్పల నాయుడు వద్ద మొరపెట్టుకున్న నేపథ్యంలో దీనిపై స్పందించిన ఆయన సోమవారం ఆ స్థలాన్ని జనసేన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ ఈ స్థలం కబ్జాకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఏలూరు ఎంఎల్ఎ, మేయర్, మున్సిపల్ కమిషనర్ పై ఉందన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ఈ స్థలాన్ని శుభ్రపరచాలని ఆయన కోరారు. లేనిపక్షంలో జనసేన తరపున మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

క్రీడాకారుల ప్రోత్సాహానికి 'ఆడుదాం ఆంధ్రా'

చింతలపూడి : గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చింతలపూడి ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజ సుధాకర్ అన్నారు. చింతలపూడి పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో వాలీబాల్‌లో మొదటి స్థానం సాధించిన చింతలపూడి టీంని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైపుణ్యం ఉన్న వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీకృష్ణ, సచివాలయం సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై అవగాహన

బుట్టాయగూడెం : ఎస్‌సి, ఎస్‌టి యాక్ట్ 1989పైన భారత రాజ్యాంగంలో పొందుపరిచినటువంటి హక్కుల గురించి ఐటిడిఎ ఎపిఒ పివిఎస్ నాయుడు అవగాహన కల్పించారు. ఐటిడిఎ కోట రామచంద్రపురం ఎన్.సంజయ్ ఉత్తర్వుల ప్రకారం రాజమహేంద్రవరం సిఐడి, ఐటిడిఎ కెఆర్ పురం ఆధ్వర్యంలో కోట రామచంద్రపురం మీటింగ్ హాల్‌లో సోమవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం డిఎస్‌పిలు బి.రామకృష్ణ, సిహెచ్.పెంటారావు, పోలవరం ఎస్‌డి పిఒ రత్నరాజు, స్థానిక సర్పంచి వి.బొజ్జి, ఐటిడి అధికారులు ప్రారంభించారు. ఈ సదస్సులో సిఐడి పివివి.నరసింహారావు, జీలుగుమిల్లి ఎస్ఐ క్రాంతి కుమార్, బుట్టాయగూడెం ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.